క్లుప్తంగా

వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేత



శ్రీనివాసపురంలో సుబ్బారావు కుటుంబానికి నగదును అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: శ్రీనివాసపురంలో ఇటీవల మృతి చెందిన డొక్కా సుబ్బారావు కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకంలో మట్టి ఖర్చులకుగాను తక్షణసాయం రూ.10 వేలు అందజేశారు. సర్పంచ్ యడ్లపల్లి రాధిక, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావుల చేతుల మీదుగా ఈ నగదును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు, వార్డు సభ్యులు జుజ్జవరపు పెంటయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ సాయి ప్రశాంత్, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నందీశ్వర విగ్రహ ప్రతిష్ఠ



సాయిబాబా ఆలయంలో ప్రతిష్ఠించిన నందీశ్వరస్వామి విగ్రహం

కుక్కునూరు: నందీశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం కుక్కునూరు శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి అఖండ దీపారాధన అనంతరం విఘ్నేశ్వరస్వామి, పుణ్యాహవచనం, వాస్తు, మండపారాధన, నవగ్రహ పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. భక్తుల చేతుల మీదుగా అష్టోత్తర శతనామావళిపూజ 108 బిల్వపత్రాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతపై ఉద్యోగుల అవగాహనా ర్యాలీ

చింతలపూడి: ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ ఉద్యోగులు గురువారం చింతలపూడి పట్టణంలో విద్యుత్ భద్రతా ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ పొదుపు, భద్రతపై విద్యుత్ శాఖ ఉద్యోగులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏడీఈ రాంబాబు నాయక్ మాట్లాడుతూ సరైన అవగాహన లేకపోవడం కారణంగా విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. వినియోగదారులు, రైతులు విద్యుత్ వాడకంపై, భద్రతపై అవగాహన పెంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏఈ వెంకయ్య, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌లో విజిలెన్స్ తనిఖీ

జంగారెడ్డిగూడెం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును గురువారం జిల్లా విజిలెన్స్ కమిటీ డైరెక్టర్ డాక్టర్ వంటిపల్లి విజయకృష్ణ పరిశీలించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని వినియోగించుకుంటున్న విద్యార్థుల సంఖ్య, విద్యార్థుల హాజరు తదితర వివరాలు ప్రధాన ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వంటశాలను పరిశీలించారు. అనంతరం వినియోగదారుల క్లబ్బు ఏర్పాటుపై శిక్షణ పొందిన అధ్యాపకునితో చర్చించారు. త్వరితగతిన విద్యార్థులతో వినియోగదారుల క్లబ్ ఏర్పాటు చేయాలని సూచించారు.

సీహెచ్ఆర్‌కు లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంకు చెందిన ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణను లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు వరించింది. సిరిమువ్వ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డును బుధవారం తాడేపల్లిగూడెంలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. వివిధ రంగాల్లో బహుముఖ ప్రజ్ఞ చూపిస్తున్న వారిని ఏటా నవంబర్ 1వ తేదీన సత్కరించి, అవార్డులు అందిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

పోలవరం రూరల్: పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకంపై ఉపాధ్యాయులు పూర్తి బాధ్యత తీసుకోవాలని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి సూచించారు. పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఆయన పరిశీలించారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలని వినతి

కొయ్యలగూడెం: ఇళ్ల స్థలాల పట్టాల మంజూరు చేయాలని కోరుతూ కన్నాపురం గ్రామ పంచాయతీ ప్రజలు గురువారం కొయ్యలగూడెంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. మహాదేవపురం గ్రామ సమీపంలో సర్వే నంబర్ 45/ 6 లోనే ప్రభుత్వ భూములలో పూరి గుడిసెలు నిర్మించుకున్నామని, పట్టాలు లేకపోవడంతో ప్రభుత్వం నిర్మించే ఇళ్లను కట్టుకోలేకపోతున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎం.వెంకటరత్నం, జె.వెంకటేశ్వరరావు, ఎం.రామారావు, డి.సంసోను, ఎం.ముత్యాలరావు, డి.రంగనాథం, జి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సేవలు దేశానికే ఆదర్శం

పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, ఐటీడీఏ పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం: ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువ కావాలనే లక్ష్యంతో గ్రామ సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకువచ్చారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని మారుమూల గ్రామమైన కామయ్యకుంట, రాజానగరంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఎమ్మెల్యే బాలరాజు, ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలరాజు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థ ద్వారా సేవలను ప్రజలకు చేరువ చేశారని అన్నారు. గ్రామ, వార్డు, సచివాలయ సేవలు దేశానికే ఆదర్శమని అన్నారు. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు ద్వారా రైతులకు తమ గ్రామ పరిధిలో ఉన్న అన్ని రకాల సేవలు అందుతున్నాయని చెప్పారు. ఈ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఐటీడీఏ పీఓ ఎం. సూర్యతేజ మాట్లాడుతూ గిరిజనులకు విద్య, వైద్య, ఉపాధి కల్పన దిశగా కృషి చేస్తున్నామని అన్నారు. గ్రామాల్లో డ్రాప్‌ఔట్ విద్యార్థులు ఉంటే వారి పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించే విధంగా తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. తొలుత ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఐటీడీఏ పీఓ సూర్యతేజలకు గిరిజన సాంప్రదాయ డోలు వాయిద్యాల నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. అలాగే ఎమ్మెల్యే, పీఓలు కొమ్ముల టోపీని ధరించి కళాకారులతో పాటు రేలపాటకు వారు కూడా నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, సర్పంచ్ పెడకం విజయలక్ష్మి, ఎంపీటీసీ కొవ్వాసి వరలక్ష్మి, సర్పంచ్ కుంజా దుర్గమ్మ, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరేటి సత్యనారాయణ, తహసీల్దార్ ఎస్.శారాశాంతి, ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఏపీకి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చందా ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు విజ్జు వెంకటేశ్వరరావు, నియోజకవర్గంలోని పార్టీ ముఖ్య నాయకులు, తదితరులు హాజరవుతారన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు తరలి వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పాలవెల్లువ లబ్ధిదారులకు రుణాల అందజేత



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న సొసైటీ చైర్మన్ వరప్రసాద్, కొణిజర్ల సర్పంచ్ జయశ్రీ

లింగపాలెం: జగనన్న పాలవెల్లువ మహిళా లబ్ధిదారులు సొసైటీ ద్వారా ఇచ్చే రుణాలతో పాడిగేదెలు కొనుగోలు చేసుకొని పాల ఉత్పత్తిని పెంచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ధర్మాజీగూడెం సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్ కోరారు. గురువారం ధర్మాజీగూడెం సొసైటీ పరిధిలోని కొణిజర్ల గ్రామంలో జగనన్న పాలవెల్లువ కింద అమూల్ సంస్థకు పాలుపోస్తున్న మహిళా లబ్ధిదారులకు సొసైటీ ఆధ్వర్యంలో చైర్మన్ వరప్రసాద్, కొణిజర్ల సర్పంచ్ నూజివేటి జయశ్రీ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో కలరాయనగూడెం సర్పంచ్ చలగుళ్ల రవిబాబు, సొసైటీ కార్యదర్శి ప్రకాశరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చింతలపూడి: చింతలపూడి మండలంలోని శంఖుచక్రపురం 11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్లకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి రాధాకృష్ణ తెలిపారు. అదేవిధంగా రాఘవాపురం పట్టణం, రాఘవాపురం రూరల్, చింతలపూడి 11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్లకు ట్రీ కటింగ్ నిమిత్తం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి రాంబాబు నాయక్ తెలిపారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఒక భక్తుడు గురువారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. నిడదవోలుకు చెందిన నూతులపాటి రమేష్ బాబు ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబానికి ఆలయ సూపరింటెండెంట్ రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

చేప పిల్లలను విడిచిపెట్టిన ఎమ్మెల్యే ఎలీజా



ఎ.పోలవరంలో చెరువులో చేప పిల్లలను విడిచి పెడుతున్న ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం రూరల్: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం మండలంలో పుట్లగట్లగూడెం, చక్రదేవరపల్లి, ఎ.పోలవరం, తాడువాయి, వేగవరం, కేతవరం, అమ్మపాలెం గ్రామాల్లో ఉన్న చెరువులు, రిజర్వాయర్లలో చేప పిల్లలను విడిచి పెట్టారు. 17 యూనిట్లకుగాను 6 లక్షల 80 వేల చేప పిల్లను విడిచి పెట్టారు. ఎ.పోలవరంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎలీజా పాల్గొని చిన్న పెద్దా చెరువులో చేప పిల్లలను విడిచి పెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ మత్స్యకారుల సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను, సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బుద్దాల సీతారామరాజు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, ఎంపీటీసీ పసుపులేటి వరలక్ష్మి, వైస్ ఎంపీపీ నరెడ్ల బుజ్జిబాబు, మత్స్యకారుల సొసైటీ అధ్యక్షుడు బెజవాడ నాగరాజు, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, ఎంపీడీవో కె. విజయ్ ప్రసాద్, మత్స్యశాఖ సహాయ సంచాలకులు బి.నర్సయ్య, జంగారెడ్డిగూడెం మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కె.మంగారావు తదితరులు పాల్గొన్నారు.

పశువుల అంబులెన్స్ ద్వారా ఆవుకు వైద్యం



దిప్పకాయలపాడులో ఆవుకు శస్త్ర చికిత్స చేస్తున్న పశు వైద్య బృందం

కొయ్యలగూడెం: సకాలంలో వైద్య సేవ అందడంతో ఓ ఆవు ప్రాణాలు నిలిచాయి. దీంతో ఆ రైతు ఆనందానికి అవధులు లేకుండా పోయింది. వివరాలలోకి వెళితే.. దిప్పకాయలపాడు గ్రామానికి చెందిన రైతు గొడ్డటి శ్రీనివాస్‌కి చెందిన రెండేళ్ల ఆవు ఇటీవల ప్రమాదానికి గురైంది. మేత కోసం పొలం తోలుకు వెళుతున్న సందర్భంలో బైక్ ఢీకొన్న ప్రమాదం వల్ల ఆవు వెనక కాలు పూర్తిగా విరిగిపోయింది. ఆహారం లేకుండా అచేతనంగా పడిఉన్న ఆవు పరిస్థితిని చూసి దుఃఖిస్తున్న రైతు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పశు వైద్య అంబులెన్స్ విషయం తెలుసుకొని గురువారం 1962 నంబర్‌కు ఫోన్ చేసి పరిస్థితి వివరించాడు. దీంతో కొయ్యలగూడెంకి చెందిన పశువైద్యాధికారి బి.శ్రీనివాస్ తణుకు నుంచి ప్రత్యేకంగా వచ్చిన పశువుల అంబులెన్స్ వాహనంలోని శస్త్ర చికిత్స నిపుణులు, వైద్యులతో కలిసి ఆరు గంటలపాటు శస్త్రచికిత్స చేసి ఆవు కాలుకి ప్లేటులను బిగించి నడిపించగలిగారు. వారం పది రోజుల్లో ఆవు పూర్తిగా కోలుకోగలదని వైద్యులు చెప్పడంతో రైతు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, వైద్యులకు కృతజ్ఞతలు తెలిపాడు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత



ఎంపీ శ్రీధర్ చేతుల మీదగా చెక్కును అందుకుంటున్న సత్యన్నారాయణరెడ్డి

లింగపాలెం: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం అని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. తోచలకరాయుడుపాలెంలో లింగపాలెం గ్రామానికి చెందిన బాధితుడు భీమిరెడ్డి సత్యన్నారాయణరెడ్డికి గురువారం ముఖ్యమంత్రి సహాయ నిధి రూ.5.50 లక్షల చెక్కును ఎంపీ చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న వారికి ఆపన్నహస్తం అందించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పాటుపడుతున్నారన్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త వంగల గంగరాజు కుటుంబ సభ్యులను ఎంపీ శ్రీధర్ పరామర్శించారు. కార్యక్రమంలో చింతలపూడి ఏఎంసీ చైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, రాష్ట్ర లిడ్‌క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొఠారి మోహన్, రంగాపురం సొసైటీ చైర్మన్ రెడ్డిన శ్రీను, నాయకులు ఏపూరి సూరిబాబు, బేతిన మధు, ఎం.సుమన్, సీహెచ్ శివ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు నిరంకుశ వైఖరిని విడనాడాలి

టి.నరసాపురం: గిరిజనుల పట్ల అప్రజాస్వామ్యంగా వ్యవహరిస్తూ బైండోవర్ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేయడం సిగ్గుచేటని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఏ.రవి విమర్శించారు. రామమ్మగూడెంలో మండల ముఖ్య కార్యకర్తల సమావేశం మడకం సుధారాణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి మాట్లాడుతూ మంగళంమెట్ట భూములు గిరిజనులు పేదలకు సంబంధించివి అన్నారు. తాత ముత్తాతల కాలం నుంచి ఈ భూములు గిరిజనుల సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ భూమిని అక్రమంగా సాగుచేసుకోవడం కోసం భూస్వాములు యత్నిస్తున్నారని, దీనికి అధికారులు, పోలీసులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రామమ్మగూడెం గిరిజన మహిళలను, యువకులపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్న అధికారులపై ఉన్నత స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రామకృష్ణ మాట్లాడారు.

కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం



తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టుశిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కామవరపుకోట: గుంటుపల్లి పంచాయతీ కొల్లివారిగూడెం గ్రామంలో తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సర్పంచ్ గోరిక దాసు గురువారం ప్రారంభించారు. మూడు నెలల పాటు మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ అందించడం జరుగుతుందని, గ్రామంలోని మహిళలు సద్వినియోగపరుచుకోవాలని సర్పంచ్ కోరారు. తపన ప్రతినిధి శివ గణేష్ మాట్లాడుతూ కామవరపుకోట, రావికంపాడులో కూడా తపన ఫౌండేషన్ ద్వారా కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో బేతిన వెంకట్రావు, బాహుబలేంద్రుని బలవర్ధిరాజు, రంగపతి రాజు, బేతిన నారాయణరావు, కొమ్మిన కేశవరావు, పామర్తి రాంబాబు, రత్తయ్య, రామకృష్ణ, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

మండవల్లికి పొట్టి శ్రీరాములు అభ్యుదయ సేవారత్న అవార్డు



సోంబాబును సత్కరించిన సిరిమువ్వ సోషల్ సర్వీస్ - ఆర్ట్స్ అసోసియేషన్ సభ్యులు

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ పామర్రు నియోజకవర్గ పరిశీలకులు, మాజీ సర్పంచ్ మండవల్లి విజయసారధి (సొంబాబు) 2023 సంవత్సరానికి గాను పొట్టి శ్రీరాములు అభ్యుదయ సేవారత్న అవార్డును అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా తాడేపల్లిగూడెంలోని గమిని ఫంక్షన్ హాల్‌లో సిరిమువ్వ సోషల్ సర్వీస్ - ఆర్ట్స్ అసోసియేషన్ సంస్థ 26వ వార్షికోత్సవం పురస్కరించుకుని బుధవారం ఈ అవార్డును సోంబాబుకు అందచేశారు. మండవల్లి సోంబాబు తాతయ్య, విద్యా దాత మండవల్లి సోమయ్య జంగారెడ్డిగూడెం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు సుమారు 7 ఎకరాలు స్థలం ఉచితంగా అందచేశారు. అలాగే సోంబాబు పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపానికి ఎకరం స్థలం ఉచితంగా అందచేశారు. పట్టణంలో ఆయన చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించిన సిరిమువ్వ సంస్థ పొట్టి శ్రీరాములు అభ్యుదయ సేవా రత్న అవార్డుతో సత్కరించింది.

వాటర్ డిస్‌ఛార్జ్ పాయింట్ ప్రారంభం



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాటర్ డిస్‌ఛార్జ్ పాయింట్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాటర్ ట్యాంక్ వద్ద కొత్తగా నిర్మించిన వాటర్ డిస్‌ఛార్జ్ పాయింట్‌ను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేశామన్నారు. ముఖ్యంగా మౌలిక వసతుల కల్పనలో కౌన్సిల్ సభ్యులు, అధికారుల సమన్వయంతో నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ నేట్రు సుబ్బలక్ష్మి గణేష్, వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, కమిషనర్ భవానిప్రసాద్, ఏఈ సంధ్య, ఏలూరు జిల్లా యూత్ విభజన అధ్యక్షుడు పడమటి గిరిబాబు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అక్బర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

వేగవరంలో ఇళ్ల పట్టాల పంపిణీ



జంగారెడ్డిగూడెంలో మహిళలకు ఇళ్ల స్థలాల పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం: రాష్ట్రంలో ఇల్లు లేని పేదవారంటూ ఎవరూ ఉండకూడదనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన అని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం వేగవరం గ్రామానికి సంబంధించి 46 మందికి ఇళ్లస్థలాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈమేరకు ఆయన పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020 డిసెంబర్ 25వ తేదీన ప్రారంభించిన ఇళ్ల స్థలాల పంపిణీ ప్రక్రియ నేటికీ కొనసాగుతోందన్నారు. ఒకే సారి 31 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత కేవలం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 2014లో నారా చంద్రబాబు నాయుడు కూడా ఇళ్లస్థలాలు ఇస్తానని హామీ ఇచ్చిన విషయం తెలిసిందనని, కానీ ఏ ఒక్కరికి ఇళ్ల స్థలం ఇవ్వకుండా, ఇల్లు మంజూరు చేయకుండా కాలం గడిపి అందరికీ మొండి చేయి చూపారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కచెల్లెమ్మలకు ఇళ్లస్థలాలు ఇవ్వడమే కాకుండా వారి పేరున రిజిస్ట్రేషన్ చేసి, ఇళ్లు మంజూరు చేసి ఇళ్లు కట్టుకునేందుకు కూడా సహకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, పార్టీ మండలాధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, వేగవరం గ్రామకమిటీ అధ్యక్షుడు నులకాని సూర్యచంద్రం, నులకాని నాయుడు, సారధి, బాబి, మందపాటి చంద్రరావు, యాదాల ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థల వివాదంలో 10 మందిపై కేసు నమోదు

చింతలపూడి: యర్రంపల్లి గ్రామంలో ఇంటి స్థలం వివాదంలో పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె ప్రసాద్ గురువారం తెలిపారు. వివరాల ప్రకారం గ్రామంలో తగరం దేవసహాయం, తగరం వెంకటేశ్వరరావుల మధ్య ఇంటి స్థలం విషయంలో వివాదం చోటుచేసుకుంది. దీనిపై ఇరువురూ కోర్టులో కేసులు వేసుకున్నారు. ఇటీవల దేవ సహాయం ఇంటి నిర్మాణం చేసుకుంటుండగా తగరం వెంకటేశ్వరరావు, తగరం రవికుమార్, పంతం రవి హైదరాబాద్ నుంచి రెండు కారుల్లో కొందరు వ్యక్తులను తీసుకు వచ్చి ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్నారు. దీంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో దేవసహాయం భార్య తగరం మాణిక్యం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రెండు వాహనాలతో సహా పలువురిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మాణిక్యం ఫిర్యాదు మేరకు సుమారు 10 మందిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అభినందన సభ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఆర్డీవోగా డాక్టర్ ఎం.ఝాన్సీరాణి చేసిన సేవలు ప్రశంసనీయమని డివిజన్‌లోని తహసీల్దార్లు అన్నారు. జంగారెడ్డిగూడెం రోటరీ క్లబ్‌లో గురువారం ఝాన్సీరాణి వీడ్కోలు, అద్దయ్య స్వాగత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఝాన్సీరాణి డివిజన్‌లో అధికారులకు సహకారం అందిస్తూ రెవెన్యూ సంబంధిత విషయాల్లో చురుగ్గా ఉండి సమస్యలు పరిష్కరించే వారన్నారు. ఈ సందర్భంగా బదిలీ అయిన ఆర్డీవో ఝాన్సీరాణిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే జంగారెడ్డిగూడెం ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన కుంభా అద్దయ్యను రెవెన్యూ శాఖ తరుపున తహసీల్దార్లు ఘనంగా సన్మానించారు.

రాజాన పండుకు పురస్కారం

జంగారెడ్డిగూడెం: శ్రీనూకాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ(పండు)కు గౌరవ పురస్కారం దక్కింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకొని తాడేపల్లిగూడెంలో సిరిమువ్వ సోషల్ సర్వీస్ - ఆర్ట్స్ అసోసియేషన్ పొట్టి శ్రీరాములు స్మారక అవార్డులను అందజేసింది. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెంలో ఆలయాల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న రాజాన పండుకు ఆధ్యాత్మిక సేవారత్న పురస్కారాన్ని అందించారు. గౌరవ అధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ, అధ్యక్షుడు గమిని సుబ్బారావు, గట్టిం మాణిక్యాలరావు, దేవకి వెంకటేశ్వర్లు, కొండ నరసింహరావు, అలివేలు మంగాదేవి దంపతులు, గోపిశెట్టి మనోహర్ పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనకు కృషిచేయాలి

టి.నరసాపురం: అవినీతి సమాజ నిర్మాణంలో యువత ముఖ్య భూమిక నిర్వహించాలని సీజీజీబీ విజిలెన్స్ అధికారి ఈ.రాంబాబు అన్నారు. బొర్రంపాలెంలో గురువారం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని పట్టిపీడిస్తున్న అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. అనంతరం బ్యాంకు నుంచి అందుతున్న సేవలను, సౌకర్యాలపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. సీజీజీబీ ప్రధాన కార్యాలయ విజిలెన్స్ అధికారి విజయ్‌కుమార్, రీజనల్ మేనేజర్ మల్లేశ్వరరావు, స్థానిక మేనేజర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎర్రకాలువ భూముల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

జంగారెడ్డిగూడెం: ఎర్రకాలువ ప్రాజెక్టు భూముల్లో అక్రమంగా పంటలు వేసి సాగు చేస్తున్న భూస్వాములపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. గురువారం ఎర్ర కాలువ ప్రాజెక్టు ఇరిగేషన్ కార్యాలయం వద్ద సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఇరిగేషన్ ఏఈ భాస్కరరావుకి వినతి పత్రం అందజేశారు. మండల కార్యదర్శి ఎ.ప్రభాకర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఎం.జీవరత్నం మాట్లాడుతూ గ్రామాల్లో సమగ్ర దర్యాప్తు చేయించి ప్రాజెక్టు భూములను ఆక్రమించిన భూస్వాములు, వారికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకొని ప్రాజెక్టును కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.సూర్యకిరణ్, భక్తుల వెంకన్న, దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎం.ఆనందరావు, జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.